'ఐటీ' రోడ్లు ..ఆపసోపాలు





మాదాపూర్ చందానాయక్ తండాలో అధ్వానంగా ఉన్న రోడ్లు



మాదాపూర్: ఐటీ కారిడార్‌లో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మాదాపూర్‌లో నిత్యం ఐటీ ఉద్యోగులతో రద్దీగా ఉండే రోడ్లు కొద్దిపాటి వర్షం పడిందంటే చాలు ఛిద్రమవుతున్నాయి.

- సాయినగర్, చందానాయక్ తండా, అయ్యప్ప సొసైటీ తదితర ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్న కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతుంది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. ఉద్యోగులు కార్యాలయాలకు, ఇంటికి చేరుకోవడానికి గంటల సమయం పడుతుంది.
- స్థానికులు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రోడ్లపై నిత్యం తిరిగే ఆటోవాలాలు, క్యాబ్ డ్రైవర్లు వచ్చే సంపాదన వాహనాల మరమ్మతులకే సరిపోవడం లేదని వాపోతున్నారు.
- రోడ్లపై భవన నిర్మాణదారులు వ్యర్థాలు వేయడంతో రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి.వ్యర్థాలు రోడ్లపై వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిమ్‌లో మంచు మనోజ్ సందడి



హైదరాబాద్ నాలెడ్జి సిటీలో జిమ్‌ను ప్రారంభించిన సినీహీరో మనోజ్ దంపతులు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని అరబిందో టవర్స్‌లో ఓ జిమ్‌ను సినీ హీరో మంచు మనోజ్, మౌనిక దంపతులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఒక్కరికి వ్యాయామం అవసరమని పేర్కొన్నారు. యువతకు ఈ జిమ్ అన్ని విధాలుగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఒప్పందం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ఐసీఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గురువారం ప్రత్యేక ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ), బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ హైదరాబాద్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. విద్యాసంబంధాలను పటిష్టం చేసుకోవడం, సహకారాన్ని పెంపొందించడానికిఈ ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ లక్ష్మీనివాస్‌శర్మ, కళాశాల గౌరవ కార్యదర్శి కిషన్ ,ముప్పాల శ్రీధర్, సీఏలు పాల్గొన్నారు.

ఆరో రోజు.. ఏడు నామినేషన్లు

- జీ ఫారంతో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్
- 25కు చేరిన నామినేషన్ల సంఖ్య



నామినేషన్ పత్రాలు అందిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆరో రోజు ఏడుగురు నామినేషన్లు వేశారు. మొత్తం నామినేషన్ల సంఖ్య 25కు చేరింది. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ ర్యాలీగా వచ్చి బీ ఫారంతో నామినేషన్ వేశారు. బీఎస్పీ అభ్యర్థిగా ఒంగోరు శ్రీనివాస్ యాదవ్, ప్రజా వెలుగు పార్టీకి చెందిన నక్కా ప్రభాకర్ , రాష్ట్రీయ జన మోర్చ పార్టీకి చెందిన షేక్ సైఫ్, స్వతంత్ర అభ్యర్థులుగా గుండ్ల కార్తీక్, శ్రీనివాస్‌రావు జాదవ్, కె.పృథ్వీపతిరావు, పి.మాధవిలతలు నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. నేడు ఏడుగురు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని, నామినేషన్ల సంఖ్య 25కు చేరిందని ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి పూజలు.. ర్యాలీలు



గచ్చిబౌలి: కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ నామినేషన్ ర్యాలీ అట్టహసంగా సాగింది. గురువారం రెండోసారి ఆయన నామినేషన్ దాఖలు చేశారు. నల్లగండ్లలోని మల్లన్న స్వామి దేవాలయంలో పూజలు చేసి అక్కడి నుంచి ఉదయం 8 గంటలకు హైదర్‌నగర్‌లోని మైసమ్మ ఆలయం, హైదర్‌నగర్ దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ర్యాలీగా బొల్లారం చౌరస్తా, ఆల్విన్ కాలనీ జంక్షన్ నుంచి గంగారం వరకు సాగింది. గంగారంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చందానగర్‌లో అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి తారానగర్‌లో తుల్జాభవాని ఆలయంలో పూజలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా శేరిలింగంపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లారు.

తారానగర్‌లో ఘన స్వాగతం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో జగదీశ్వర్‌గౌడ్‌కు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు తారానగర్‌లో జగదీశ్వర్‌గౌడ్‌కు గజమాల వేయడంతో పాటు పూల వర్షం కురిపించారు.

భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేస్తాం

- బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరికెపూడి గాంధీ
- కరపత్రాలతో ఇంటింటి ప్రచారం



ప్రేమ్‌నగర్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ



మార్తాండనగర్‌లో.. గాంధీకి హారతి ఇస్తున్న మహిళలు

హఫీజ్‌పేట్ : రానున్న రోజుల్లో సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను మరింత అభివృద్ధి చేస్తామని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. గురువారం కొండాపూర్ డివిజన్ పరిధిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ స్థానిక కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ బి బ్లాక్‌లోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రేమ్‌నగర్ ఏ,బి బ్లాక్‌లు, మార్తాండనగర్, హనీఫ్ కాలనీలలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అంతా బీఆర్‌ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని, వారందరికి అండగా నిలబడతామన్నారు .సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తాయన్నారు. ప్రజలందరికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నానన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు లేకుండా ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేశామన్నారు. మరిన్ని ఐటీ సంస్థలు రానున్నాయని హైదరాబాద్ దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందన్నారు. ముచ్చటగా మూడోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఆసరా పెన్షన్ రూ.2016 నుంచి రూ.5,013లకు పెంపు, తెలంగాణలో 93 లక్షల పైగా కుటుంబాలకు కేసీఆర్ బీమా, ప్రతి ఇంటికి ధీమా పథకం రూ.5లక్షల బీమా కల్పిస్తామన్నారు. రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం, వికలాంగులకు పెన్షన్ రూ.4016 నుంచి రూ.6016లకు పెంపు, రైతు బంధు పథకం ఎకరానికి రూ.10000 నుంచి రూ.16000లకు పెంచడం జరుగుతుందన్నారు. అర్హులైన పేద మహిళలకు నెలకు రూ.3వేలు, అర్హులైన లబ్ధిదారులకు, అక్రిడేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులకు రూ.400కే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మూడోసారి గెలిపించాలి

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ముచ్చటగా మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే సతీమణి అరెకపూడి శ్యామలదేవి పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని డైనమిక్ కాలనీ, ప్రజా షెల్టర్, బుద్ధవర్షిత్ అపార్ట్‌మెంట్, తేజ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో గాంధీ కుమారుడు పృథ్వీ గాంధీ, కోడలు భార్గవి, కుమార్తె ప్రణీత గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సతీమణి సుమలత, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ, అపార్ట్‌మెంట్లలో ప్రతి ఇంటికి తిరిగి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చేసిన అభివృద్ధి, సంక్షేమం, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి గాంధీ కుటుంబ సభ్యులు

అంగరంగ వైభవంగా శ్రీవారి పుష్పక వాహన సేవ



హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం శ్రీవారి పుష్పక వాహన సేవ నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు ఉత్సవాన్తస్నపనం, విశేషపూజ, మధ్యాహ్నం 12.00 గంటలకు హారతీ తీర్థప్రసాదాలు అందించారు.



శ్రీవారి గరుడ వాహన, సహస్ర దీపాలంకార సేవలో పాల్గొన్న భక్తులు

ఎన్‌ఈపీ దేశ అభివృద్ధిని నిర్ధారిస్తుంది

కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి డా.సుభాష్ సర్కార్

రాయదుర్గం: జాతీయ విద్యావిధానం దేశ అభివృద్ధిని నిర్ధారిస్తుందని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి డాక్టర్ సుభాష్‌సర్కార్ పేర్కొన్నారు. మనూలో టీచింగ్ స్టాఫ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌తో ఆయన గురువారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయం నూతన విద్యా విధానం-2020 (ఎన్‌ఈపీ-2020)ని అమలు చేసిన తీరు అభినందనీయమన్నారు. నూతన జాతీయ విద్యావిధానం రాబోయే పదేళ్లలో దేశ విద్యారంగాన్ని పూర్తిగా మార్చివేస్తుందన్నారు. విద్యార్థులు సులభంగా విద్యనభ్యసించడంతోపాటు నైపుణ్యం కలిగిన వారిని తీర్చిదిద్దడం ద్వారా ఉపాధి పొందడం సులువు అవుతుందన్నారు.

చందానగర్‌లో రూ.11,91,828 సీజ్

హఫీజ్‌పేట్ : చందానగర్ ప్రధాన రోడ్డులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద వాహనంలో తరలిస్తున్న రూ.10,60,528 లను పోలీసులు పట్టుకున్నారు. మాణికేశ్వరి నగర్, ఉస్మానియా యూనివర్సిటి క్యాంపస్‌కి చెందిన ఈ.కృష్ణ ,అలాగే మొఘల్‌పురాకు చెందిన మహ్మద్ ముజాఫర్ రూ.1 ,31,300 లకు సరైన పత్రాలు చూపకపోవడంతో ఎస్‌ఓటీ, చందానగర్ పోలీసులు సీజ్ చేశారు.

బీఆర్‌ఎస్ విజయం తథ్యం



రాయదుర్గంలో ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా నాయకులు

రాయదుర్గం: బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు తథ్యమని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాయదుర్గం, పంచవటి కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలు, బస్తీలలో ప్రజలు మళ్ళీ సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గణేష్‌ముదిరాజ్, రాజునాయక్, చెన్నంరాజు, నరేష్, సతీష్, అంజమ్మ, రాజు ముదిరాజ అశోక్‌యాదవ్, నారాయణ, గోవింద్ అనీల్ సింగ్, జగదీశ్, మధు, భిక్షపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి బరిలో స్వతంత్ర అభ్యర్థిగా కార్తీక్‌గౌడ్

గచ్చిబౌలి: యువజన నాయకుడు, తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్ విద్యార్థుల రాష్ట్ర జేఏసీ నాయకుడు గుండ్ల కార్తీక్‌గౌడ్ శేరిలింగంపల్లి నియోజవకర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన ఓ ఐటీ కంపెనీ సీఈఓగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువతకి ఆదర్శంగా నిలుస్తానని, ఎన్నికల్లో ఖచ్చితంగా గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నియోజకవర్గ ప్రజలే నా ఊపిరి

- ఉప్పెనలా కదిలిన బీఆర్‌ఎస్ దండు
- హనుమాన్, గణేశ్‌గడ్డ సిద్ధివినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- గులాబీసైన్యంతో భారీ వాహన ర్యాలీ
- పార్టీ శ్రేణుల మధ్య ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న మహిపాల్‌రెడ్డి



నామినేషన్ వేయడానికి భారీ ర్యాలీతో వెళుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ఎటుచూసినా దారులన్నీ గులాబీమయంగా మారాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా గురువారం వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబసభ్యులతో కలిసి మొదటగా పంచముఖి, చైతన్యబస్తీలోని హనుమాన్ ఆలయాలతో పాటు ప్రసిద్ధిగాంచిన గణేష్‌గడ్డ సిద్ధి వినాయక ఆలయాన్ని దర్శించుకొని నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సపనదేవ్, శంకర్‌యాదవ్, ప్రజాప్రతినిధులు, గులాబీసైన్యంతో కలిసి లక్డారం, ఇస్నాపూర్ ముత్తంగి మీదుగా పటాన్‌చెరు వరకు భారీ ర్యాలీ నిర్వహించి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా సమక్షంలో మహిపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన

పటాన్‌చెరు టౌన్: అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన అందించామని, సీఎం కేసీఆర్ ఆశీస్సులు, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల మద్దతుతో మూడోసారి బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ సహకారంతో రూ.9వేల కోట్లకు పైగా నిధులతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని వివరించారు. ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకతతో గడపగడపకూ అందిస్తున్నామని తెలిపారు. శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ పుష్ప, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, సపానదేవ్, మాజీ ఎంపీపీ యాదగిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గంలోని కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్ల సంఘానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన కేబుల్ ఆపరేటర్ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగి ఉండే కేబుల్ ఆపరేటర్లు బీఆర్‌ఎస్‌కు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఆ సంఘం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

మరోసారి ఆశీర్వదించండి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి తనని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఐజీ కాలనీలో రాష్ట్ర కాపు సంఘం నాయకులు అరవ రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కాపు సంఘం సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో కాపు సామాజికవర్గం సంఘానికి స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్ బాలాజీ, సీనియర్ నాయకులు శంకర్‌యాదవ్, ఆదర్శ్ రెడ్డి, కాపు సంఘం నాయకులు సమ్మెట ప్రసాద్, పరమేశ్వరరావు, రావులపల్లి రమేష్, నాగమోహన్‌రావు, కృష్ణారావు, శంకర్‌రావు, నరేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నాయకుల మద్దతు

జిన్నారం(పటాన్‌చెరు): ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా జిన్నారం మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. రాష్ట్ర నాయకులు వెంకటేష్ గౌడ్, నాయకులు బోజిరెడ్డి, నర్సింహ, నీలం మోహన్ ముదిరాజ్, సంఘం నాయకులు వెంకటేష్, నీలం సత్యనారాయణ, వరుణ్‌చందు ఆంజనేయులు, భాను పాల్గొన్నారు.



గణేష్‌గడ్డ ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



ఎమ్మెల్యేకు మద్దతు తెలిపిన జిన్నారం ముదిరాజ్ సంఘం నాయకులు

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరినవారికి కండువాలు కప్పుతున్న తుమ్మల పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా పాండురంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని వాణీశ్రీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కారు గుర్తుపై ఓటు వేసి మహిపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కల్పనఉపేందర్‌రెడ్డి, అమీన్‌పూర్ బీఆర్‌ఎస్ వైస్ ప్రెసిడెంట్ దేవేందర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాఠశాలలో దీపావళి వేడుకలు



వేడుకల్లో మేరు ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మదీనాగూడ మేరు ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు గురువారం దీపావళి వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ దీపావళి పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. సంగీతం, ముగ్గులు, నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మేరు ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతినిధులు స్వీట్లు పంచి పెట్టారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

మియాపూర్: ఇంటి నుండి బయటకు వెళ్లిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యమయ్యాడు. మియాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని గోకుల్‌ప్లాట్స్ వాసవి విహార్‌లో నివాసముంటున్న యు.కృష్ణ (30 సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. బుధవారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుండి బయటికి వెళ్లాడు. రాత్రి అయిన తిరిగి రాలేదు. ఇంట్లో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల స్నేహితులు, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.